## ఉపాధ్యాయ దినోత్సవం

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం అక్టోబర్ 5న నిర్వహించారు. భవిష్యత్తును రూపొందించే ఉపాధ్యాయుల పాత్రను గుర్తించడానికి, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, వారి హక్కులు, బాధ్యతలను నెరవేర్చడానికి ఈ దినోత్సవాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. 1966లో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌వో), యునెస్కో ఉపాధ్యాయ స్థితిపై సదస్సు నిర్వహించారు. ఇందుకు గుర్తుగా 1994 నుంచి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1966 నాటి బోధనా సిబ్బందికి సంబంధించిన సిఫారసులను 1997లో ఆమోదించారు. ఈ ఏడాది ఈ దినోత్సవ థీమ్ 'ది టీచర్స్ వుయ్ నీడ్ ఫర్ ది ఎడ్యుకేషన్ వుయ్ వాంట్: ది గ్లోబల్ ఇంపరేటివ్ టు రిజర్వ్ ది టీచర్ షార్టేజ్'.

# రావణకాష్టం.. ఇజ్రాయెల్ -

**తూర్పు జెరూసలెంలోని అల్-అఖ్సా కేంద్రంగా ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య అలజడి రేగింది. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతూ వస్తున్న ఉద్రిక్తతలు తాజాగా ఇరు దేశాల మధ్య భీకర దాడులకు మళ్లీ తెరతీశాయి. అసలు అల్-అఖ్సా అంటే ఏమిటి? దీన్ని కేంద్రంగా చేసుకొని ఎందుకు ఘర్షణ సాగుతుంది? వార్తల్లో నిలిచిన 'హమాస్' అంటే ఏంటి? అది ఎలా ఏర్పడింది? ఆ సంస్థకు ఎవరు సాయం చేస్తున్నారు? అనే సందేహాలు అందరికీ కలుగుతు న్నాయి. వీటన్ని టికీ సమాధా నాలు తెలుసుకుందాం.**




### చరిత్ర

- ఇజ్రాయెల్ ఎలా ఏర్పడింది, పాలస్తీనా రెండు భూభాగాలుగా ఎందుకుంది. ఈ వందేళ్ల సంక్షోభానికి ముగింపు ఉంటుందా? అనే ప్రశ్నలు చాలామందికి తలెత్తుతాయి. ఒకసారి ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అర్థం చేసుకునే ముందు ఈ ప్రాంత చరిత్ర ఏంటో చూద్దాం.
- మొదటి ప్రపంచ యుద్ధం సమయం నుంచి ఇదొక రావణకాష్టంలా రగులుతూనే ఉంది. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలో ఐరోపాలో యూదులను లక్ష్యంగా చేసుకుని హింస ప్రజ్వరిల్లింది. ఆ పరిస్థితుల్లో యూదులకు ప్రత్యేక దేశం కావాలన్న డిమాండ్ ఊపందుకుంది.
- మధ్యధరా సముద్రం, జోర్డాన్ నదికి మధ్య ఉన్న పాలస్తీనా ప్రాంతాన్ని యూదులు, ముస్లింలు, క్రైస్తవులు కూడా పవిత్ర స్థలంగా భావిస్తారు, ప్రపంచవ్యాప్తంగా యూదులకు, ముస్లింలకు కూడా జెరూసలెం పవిత్ర స్థలం.
- మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఈ ప్రాంతాన్ని ఒట్టోమాన్ సామ్రాజ్యం పరిపాలించేది. ఈ ప్రాంతం చాలావరకు ముస్లింలు, అరబ్బుల స్వాధీనంలో ఉండేది. ఐరోపాలో తమపై జరుగుతున్న దాడిని తప్పించుకునేందుకు అనేకమంది యూదులు ప్రాణాలు చేతబట్టుకుని పాలస్తీనా ప్రాంతానికి తరలివచ్చారు. క్రమేపీ ఈ ప్రాంతానికి వచ్చే యూదుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దాంతో, స్థానిక అరబ్బులు, యూదులకు వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభించారు.
- మొదటి ప్రపంచ యుద్ధంలో పాలస్తీనా ప్రాంతాన్ని పరిపాలిస్తున్న ఒట్టోమాన్ సామ్రాజ్యం ఓటమి పాలైంది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఒట్టోమాన్ సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడంతో, ఆ ప్రాంతాన్ని తమ అధికారం కిందకు తెచ్చుకునేందుకు బ్రిటన్, లీగ్ ఆఫ్ నేషన్స్ నుంచి అనుమతి పొందింది.
- మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు, జరుగుతున్న సమయంలో కూడా ఆంగ్లేయులు యూదులకు, అరబ్బులకు అనేక వాగ్దానాలు చేశారు. వాటిలో కొన్నింటిని బ్రిటన్ నెరవేర్చలేకపోయింది. అంతే కాకుండా, మధ్యప్రాచ్యాన్ని ఫ్రాన్స్‌తో ముందే పంచుకుంది. ఈ పరిస్థితులన్నీ యూదులు, అరబ్బుల మధ్య ఉద్రిక్తతలకు కారణమయ్యాయి.
- రెండు పక్షాల సాయుధ దళాల మధ్య హింసాత్మక ఘర్షణలు ప్రారంభమయ్యాయి. నాజీల చేతిలో యూదుల ఊచకోత, రెండో ప్రపంచ యుద్ధం తరువాత యూదులకు ప్రత్యేక దేశం కావాలన్న డిమాండ్ మరింత పెరిగింది. బ్రిటన్ ఆ ప్రాంతాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకుంది. ఆ ప్రాంతంలో యూదులు తక్కువ సంఖ్యలోనూ, అరబ్బులు ఎక్కువ సంఖ్యలో ఉండేవారు.
- పాలస్తీనా ప్రాంతంలో యూదుల రాజ్యాన్ని ఏర్పాటు చేసే బాధ్యత ప్రపంచ దేశాలు బ్రిటన్‌కు అప్పగించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. పాలస్తీనా తమ పూర్వీకులకు చెందిన ప్రాంతమని తమకే హక్కు ఉందని యూదులు వాదిస్తే, అరబ్బులు అదే తమ మాతృభూమి అని దాన్ని వదల్లేమని కరాఖండీగా చెబుతూ వచ్చారు.
- 1920–1940 మధ్య పాలస్తీనాలో యూదుల శరణార్థుల సంఖ్య భారీగా పెరిగింది. ఆ తర్వాత రెండో ప్రపంచ యుద్ధం కాలంలో యూరప్‌లో యూదులపై ఊచకోతతో ఎందరో పాలస్తీనాకు పారిపోయి వచ్చి తలదాచుకున్నారు. 1947లో పాలస్తీనాను రెండుగా విభజించి యూదులకు, అరబ్బు లకు పంచి ఇవ్వాలని, జెరూసలెంను అంతర్జాతీయ నగరంగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితి సిఫారసు చేసింది. కానీ అరబ్బులు అందుకు సమ్మతించలేదు. ఈ వివాదాన్ని బ్రిటిష్‌వారు పరిష్కరించలేకపోయారు.
- 1948లో బ్రిటిష్ వాళ్లు ఆ ప్రాంతాన్ని విడిచివెళ్లిపోయిన తరువాత యూదులు ఇజ్రాయెల్ దేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 1948, మే 14న ఇజ్రాయెల్ దేశం ఏర్పడింది. దీన్ని పాలస్తీనియన్లు తీవ్రంగా వ్యతిరేకంచడంతో ఘర్షణ చెలరేగింది. అప్పట్నుంచి ఇరు ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం కొనసాగుతూనే ఉంది.
- దాంతో, స్థానిక ఉద్రిక్తతలు ప్రాంతీయ విభేదాలుగా మారిపోయాయి. మరుసటి రోజే ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, ఇరాక్‌లు ఈ ప్రాంతంపై దాడి చేశాయి. ఇదే మొదటి అరబ్–ఇజ్రాయెల్ యుద్ధం. దీన్నే యూదుల స్వాతంత్ర్య సంగ్రామం అని కూడా పిలుస్తారు. చుట్టుపక్కల ఉన్న అరబ్బు దేశాలు కూడా సైనిక చర్యలకు దిగాయి.
- 1967లో మరోసారి అరబ్ దేశాలకు, ఇజ్రాయెల్‌కు మధ్య ఘర్షణలు చెలరేగి భారీ యుద్ధానికి దారి తీశాయి. ఆ ఏడాది జూన్ 5 నుంచి 10 వరకు జరిగిన సంఘటనల దీర్ఘకాలిక ప్రభావాలు అనేక స్థాయిల్లో కనిపించాయి. ఈ యుద్ధంలో అరబ్ దేశాల కూటమిపై ఇజ్రాయెల్ విజయం సాధించింది. గాజా స్ట్రిప్, ఈజిప్ట్‌లోని సినాయ్ ద్వీపకల్పం, వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేం, గోలన్ హైట్స్ ఇజ్రాయెల్ ఆధీనంలోకి వచ్చాయి. ఐదు లక్షల మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులయ్యారు.
- 1973లో అరబ్ దేశాలకు, ఇజ్రాయెల్‌కు మధ్య 'యోం–కిప్పూర్' యుద్ధం జరిగింది. ఈజిప్ట్, సిరియా కలిసి ఇజ్రాయెల్‌పై దండెత్తాయి. ఈ యుద్ధంలో ఈజిప్ట్ సినాయ్ ద్వీపకల్పాన్ని స్వాధీనం చేసుకుంది. 1982లో ఇజ్రాయెల్ సినాయ్ ప్రాంతం నుంచి వైదొలగింది. కానీ, గాజా ప్రాంతంపై పట్టు వదల్లేదు.
- ఆరు సంవత్సరాల తరువాత ఈజిప్ట్, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్‌తో సమస్యలను పరిష్కరించుకున్న తొలి అరబ్ దేశం ఇదే. తరువాత, జోర్డాన్ కూడా ఈజిప్ట్ బాటలో నడిచింది.

### బాల్‌ఫోర్ డిక్లరేషన్

- ప్రస్తుతం ఇజ్రాయెల్ ఉన్న ప్రాంతాన్నే దేవుడు తమ పూర్వీకుడైన అబ్రహంకు, ఆయన వారసులకు ఇస్తానని వాగ్దానం చేసినట్లు యూదులు విశ్వసిస్తారు. పూర్వం ఈ ప్రాంతంపై అసిరియన్లు (ప్రస్తుత ఇరాక్, ఇరాన్, టర్కీ, సిరియాల్లో నివసిస్తున్న గిరిజనులు), బాబిలోనియన్లు, పర్షియన్లు, మాసిడోనియన్లు, రోమన్లు దాడి చేశారు. రోమన్ పాలనలోనే ఈ ప్రాంతానికి పాలస్తీనా అనే పేరు వచ్చిందని తరువాత ఈ ప్రాంతం నుంచి యూదు ప్రజలను బహిష్కరించారు. ఇస్లాం పెరుగుదలతో ఏడో శతాబ్దంలో పాలస్తీనా అరబ్బుల ఆధీనంలోకి వచ్చింది. తరువాత యూరోపియన్లు దీన్ని జయించారు.
- 1516లో పాలస్తీనా టర్కీ ఆధీనంలోకి వచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటన్ ఆధీనంలోకి వెళ్లింది. 1947 సెప్టెంబర్ 3న ఐక్యరాజ్యసమితి ప్రత్యేక కమిటీ పాలస్తీనాపై తన నివేదికను జనరల్ అసెంబ్లీకి సమర్పించింది. ఈ నివేదికలో మధ్యప్రాచ్యంలో యూదుల ప్రత్యేక రాజ్యం స్థాపించడానికి మత పరమైన, చారిత్రక కారణాలను కమిటీ అంగీకరించింది.
- 1917లో 'బాల్‌ఫోర్ డిక్లరేషన్'లో పాలస్తీనాలో యూదులకు ప్రత్యేక రాజ్యం ఏర్పాటు చేసేందుకు బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించింది. ఈ డిక్లరేషన్‌లో పాలస్తీనాకు, యూదులకు ఉన్న చారిత్రక సంబంధాన్ని అంగీకరించారు. దాంతో, ఇక్కడ యూదుల ప్రత్యేక రాజ్యం ఏర్పాటుకు పునాది పడింది. అయితే, అరబ్బులు, యూదుల మధ్య వివాదాలను బ్రిటన్ పరిష్కరించలేకపోవడంతో ఈ సమస్యను ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకెళ్లింది.

### ఐక్యరాజ్యసమితి ఆమోదం

- 1947, నవంబర్ 29న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ పాలస్తీనా విభజన ప్రణాళికను ఆమోదించింది. జెరూసలేంను అంతర్జాతీయ నగరంగా ప్రక టించాలని సిఫారసు చేసింది. దీనికి యూదు నాయకులు సమ్మతి తెలిపినప్పటికీ, అరబ్బులు అంగీకరించలేదు. కాబట్టి ఈ ప్రణాళిక ఎప్పుడూ అమల్లోకి రాలేదు.
- 1948లో బ్రిటిష్ వాళ్లు ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లిపోయిన తరువాత ఇజ్రాయెల్ స్వతంత్ర రాజ్యం గా ప్రకటించు కుంది. మరుసటి రోజే ఇజ్రాయెల్ ఐక్యరాజ్యసమితి సభ్యత్వం కోసం దరఖాస్తు చేసింది. ఒక సంవత్సరం తరువాత అది ఆమోదం పొందింది. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాల్లోని 83 శాతం దేశాలు ఇజ్రాయెల్‌ను స్వతంత్ర దేశంగా గుర్తించాయి.
- మరి రెండు పాలస్తీనా భూభాగాలు ఎందుకున్నాయి అనే ప్రశ్న కూడా చాలా మందిలో తలెత్తుతుంది. పాలస్తీనాపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక కమిటీ 1947లో జనరల్ అసెంబ్లీకి సమర్పించిన నివేదికలో వెస్టర్న్ గ్యాలీ (సమారియా, జుడియా పర్వత ప్రాంతం)ని అరబ్ దేశంలో చేర్చాలని, జెరూసలెం, ఈజిప్ట్ సరిహద్దులో ఉన్న ఇస్దుద్ తీర ప్రాంతాన్ని బయట ఉంచాలని సిఫారసు చేసింది. అయితే 1949లో ఏర్పడిన 'అర్మిస్టైస్ రేఖ' ద్వారా పాలస్తీనా విభజన జరిగింది.
- ఇజ్రాయెల్ ఏర్పడిన అనంతరం, మొదటి అరబ్–ఇజ్రాయెల్ యుద్ధం తరువాత ఈ రేఖ ఏర్పడింది. పాలస్తీనాలో ఉన్న వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్ ఒకదానికొకటి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. వెస్ట్ బ్యాంక్ వైశాల్యం 5,970 చదరపు కిలోమీటర్లు కాగా, గాజా స్ట్రిప్ వైశాల్యం 365 చదరపు కిలోమీటర్లు. వెస్ట్ బ్యాంక్ జెరూసలెంకు, జోర్డాన్‌కు తూర్పు భాగంలో ఉంది.
- పాలస్తీనా, ఇజ్రాయెల్ కూడా జెరూసలెంను తమ రాజధానిగా ప్రకటించుకున్నాయి. గాజా స్ట్రిప్ 41 కిలోమీటర్ల పొడవు.. 6 నుంచి 12 కిమీ వెడల్పు ఉంటుంది. గాజా సరిహద్దు, ఇజ్రాయెల్ వెంట 51 కిలోమీటర్లు, ఈజిప్టు వెంట ఏడు కిలోమీటర్లు, మధ్యధరా తీరం వెంట 40 కిలోమీటర్లు ఉంటుంది. గాజా స్ట్రిప్‌ను 1967 యుద్ధంలో ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది.